క్లుప్తంగా

17నుంచి చండీ మహాయాగం



మహాయాగ ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న తిరుమల్‌రెడ్డి

బడంగ్‌పేట్: హస్తినాపురం ద్వారకానగర్‌లో వెలసిన భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 17నుంచి 19వ తేదీ వరకు మన్యు రుద్ర సహిత నవ చండీ మహా యాగం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు సింధు తిరుమల్‌రెడ్డి దంపతులు సోమవారం ఆవిష్కరించారు. రేణుక రాజరాజేశ్వరి పీఠం అధ్యక్షులు మెళ్లూరి నవీన్‌శర్మ ఆధ్వర్యంలో ఈ యాగం క్రతువులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. లోక కల్యాణం కోసం ఈ యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సబితారెడ్డిని విమర్శిస్తే సహించేదిలేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఇందిర

కందుకూరు: నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న మంత్రి సబితారెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని బీఆర్‌ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు టి.ఇందిర హెచ్చరించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి బీజేపీ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. తన ఉనికి కోసం మంత్రిపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సత్యం తెలుసుకుని బీజేపీ నాయకులు మసలుకోవాలన్నారు. లేకపోతే చూస్తూ ఊరుకునేదిలేదన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న నేతలు

కందుకూరు: మండలంలోని ఆకులమైలారం గ్రామానికి చెందిన పొల్కం కొమరయ్య, కాకి శ్యామలమ్మకు మంత్రి సబితారెడ్డి చొరవతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 60 వేలు, రూ. 45 వేల చెక్కులను సోమవారం ప్రజాప్రతినిధులు, నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గొరిగె రాజు, మాజీ సర్పంచ్ దేవరశెట్టి నందీశ్వర్, ఉప సర్పంచ్ వై.రాంరెడ్డి, నాయకులు శంకర్ తిరుపతయ్య, పొన్న అంజయ్య, అమరేందర్‌రెడ్డి, గౌర శేఖర్, అర్చన మల్లేష్, పెద్ద కుర్మ పాండు, సూర ప్రభాకర్, తల్లోజు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల సమస్యలు పరిష్కరించండి

ఎన్‌ఎస్‌యూఐ నాయకుడు ఫరీద్

ఆమనగల్లు: పట్టణంలోని బస్టాండ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా నాయకుడు ఫరీద్ కోరారు. బస్టాండ్ ఉన్నత పాఠశాలను సోమవారం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫరీద్ మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన భవనంలో తరగతులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. పాఠశాలలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాఠశాలలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేదంటే ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు మహేశ్, బాలకృష్ణ, లక్ష్మణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

ఆమనగల్లు: మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్, ఆమనగల్లు మున్సిపాలిటీ కౌన్సిలర్ కమటం రాధమ్మ కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులోని బీసీ కాలనీ, సంకటోనిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి మంజూరైన రూ.10 లక్షలతో నిర్మిస్తున్న మురుగు కాల్వ నిర్మాణ పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్‌తో కలిసి రాధమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు.

వడివడిగా రోడ్డు విస్తరణ పనులు

నాలుగు లేన్లతో మారనున్న మహేశ్వరం రూపురేఖలు

- రూ. 4.75 కోట్లతో పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మహేశ్వరం: పట్టణ పరిధిలోని గేటు (శ్రీశైలం జాతీయ రహదారి) నుంచి మహేశ్వరం వరకు నాలుగు వరుసల బీటీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 12 సంవత్సరాల క్రితం నిర్మించిన రోడ్డు గుంతలమయంగా మారడంతో మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని 6కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 4.75 కోట్లు మంజూరు చేయించారు. దీంతో పనులు ప్రారంభమయ్యాయి. పట్టణ పరిధిలోని గేటు నుంచి మహేశ్వరం పట్టణం వరకు రోడ్డు, మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయనున్నారు. ఎడమ, కుడి వైపు రెండు వరుసలు బీటీ నిర్మాణం చేస్తున్నారు. ఇప్పటికే రోడ్డు పక్కన ఉన్న ముళ్ల చెట్లు, గడ్డి, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. రోడ్డుపై పేరుకు పోయిన మట్టిని తొలగించి, గుంతలను పూడ్చుతున్నారు. మరో పక్క డాంబర్ వేస్తున్నారు. నిత్యం ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేసి వాహనాలను మళ్లిస్తున్నారు.



చురుగ్గా సాగుతున్న నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణ పనులు

మహేశ్వరానికి కొత్త రూపు

నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం, మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కావడంతో మహేశ్వరం రూపురేఖలు మారనున్నాయి. ఇది వరకు రాత్రి వేళలలో రోడ్డంతా చిమ్మ చీకటిగా ఉండేది. తరచూ ప్రమాదాలు జరిగేవి. ప్రస్తుతం ఎల్‌ఈడీ సెంట్రల్ లైటింగ్‌తో తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి మహేశ్వరం వరకు జిగేల్ మంటున్నాయి. రోడ్డు విస్తరణతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని స్థానికులు అంటున్నారు.

మంత్రి సబితారెడ్డికి కృతజ్ఞతలు



మహేశ్వరం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి సబితారెడ్డికి ధన్యవాదాలు. నాలుగు వరుసల బీటీ రోడ్డుతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోతాయి. రూ. 5కోట్ల 46 లక్షలతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం అభినందనీయం. మంత్రి సబితారెడ్డి చొరవతో మహేశ్వరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది.

– రఘుమారెడ్డి, ఎంపీపీ, మహేశ్వరం

త్వరలో పనులు పూర్తి చేస్తాం

మహేశ్వరం రోడ్డు పనులను తర్వలో పూర్తిచేస్తాం. ఇప్పటికే పనులు ప్రారంభించి వేగం పెంచాం. నాలుగు వరుసల బీటీ రోడ్డుతో ట్రాఫిక్ సమస్యలు తీరుతాయి. ప్రజలు, వాహనదారులకు మెరుగైన రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుంది. రోడ్డు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. నెలాఖరులోగా రోడ్డు అందుబాటులోకి వస్తుంది.

– వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ, మహేశ్వరం

మరిన్ని రోడ్లను అభివృద్ధి చేస్తాం



నియోజకవర్గంలోని ఇరుకు రోడ్లను విస్తరిస్తాం. సీఎం కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్ చొరవతో నియోజకవర్గానికి భారీగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేస్తున్నాం. రావిర్యాల ఈ–సీటీ, హార్డ్ వేర్ పార్క్, మహేశ్వరం ఎల్రక్టానిక్ సిటీ, తుమ్మలూరు ప్లాస్టిక్ పార్కులో భారీ పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాం. మహేశ్వరం నుంచి పెద్ద గోల్కొండ వయా మన్సాన్‌పల్లి చౌరస్తా, మహేశ్వరం నుంచి స్టేషన్ తిమ్మాపూర్ వయా మన్సాన్‌పల్లి చౌరస్తా, అమీర్‌పేట్ రోడ్లను నాలుగు లైన్లగా విస్తరించేందుకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నా.

– సబితారెడ్డి, మంత్రి

ఉద్యమకారులకు గుర్తింపు ఏదీ?

గౌరవప్రదమైన పింఛన్ ఇవ్వాలి

వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమకు గుర్తింపు లేకుండా పోయిందని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు పేర్కొన్నారు. సోమవారం వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లో 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు తదితరులు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు 1969 ఉద్యమమే మూలమని, దాని స్ఫూర్తితోనే మలిదశ ఉద్యమంతో తెలంగాణ కల సాకారం అయిందన్నారు. అయితే అప్పటి ఉద్యమకారులకు నేడు గుర్తింపు లేదని, ముఖ్యమంత్రి కేసీఆర్ అపాయింట్‌మెంట్ కూడా దొరకడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము అందరం 70 ఏళ్లకు పైబడిన వారమేనని వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నామని అన్నారు. తమను తెలంగాణ సమరయోధులుగా గుర్తించాలని, అర్హులైన వారికి గౌరవప్రదమైన పింఛన్ ఇవ్వాలని, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 21న రవీంద్ర భారతిలో 1969 ఉద్యమకారుల సభను నిర్వహిస్తున్నామని, ఈ సభకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు హాజరవుతున్నారని వారు తెలిపారు. ఉద్యమకారులు అధికసంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మేచినేని కిషన్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రావు, వనం చంద్రమౌళి, చంద్రారెడ్డి, కృష్ణమూర్తి, లక్ష్మారెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

అంధత్వ నివారణకే ‘కంటి వెలుగు’

మహేశ్వరం: అంధత్వ నివారణకే రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో సర్పంచులు, ఎంపీటీసీలు, వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మంగళవారం ప్రతి గ్రామ పంచాయతీలో సర్పంచుల అధ్యక్షతన సభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీఓ నర్సింహ, వైస్ ఎంపీపీ సునిత, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, వైద్యాధికారి అజయ్ పాల్గొన్నారు.

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి సూచించారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 18నుంచి ప్రారంభం కానున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై వైద్యాధికారులు రాధిక, హరినాథ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిపొందాలన్నారు. రాజకీయాలను పక్కకు పెట్టి ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు సహకరించాలని వైద్యాధికారులు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జి.శమంత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకట్రాములు, సీహెచ్‌ఓ రవీందర్, ఎంపీహెచ్‌ఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మీర్‌పేట: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మేయర్ దుర్గ

విజయవంతం చేయాలి

మీర్‌పేట: కంటి వెలుగు కార్యక్రమం పేదలకు వరమని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ ఎం దుర్గ అన్నారు. ఈ నెల 18న ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాఈ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, డీఈ గోపీనాథ్, ఆర్‌ఓ అంజన్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి భవ్యరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

- టూరిజం చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా
- క్రీడా సామగ్రి పంపిణీ

హుడాకాంప్లెక్స్: క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని టూరిజం చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. సోమవారం సరూర్‌నగర్ విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా స్కూళ్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పుట్టిన ఊరు, తల్లిదండ్రులు, గురువులను మరువరాదని సూచించారు. యువత మంచి ఆలోచనతో సేవ చేయాలని సూచించారు. తెలంగాణను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు ధరించి ఆ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. డీసీ కృష్ణయ్య, ప్రిన్సిపాల్ శివపార్వతి పాల్గొన్నారు.



క్రీడా సామగ్రితో విద్యార్థులు

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

చైర్మన్ మధుమోహన్

తుక్కుగూడ: మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని చైర్మన్ మధుమోహన్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం నిమిత్తం రూ. 1.30 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. మున్సిపల్ సిబ్బందికి రెండు జతల బట్టలు అందజేశామన్నారు. ఈ నెల 15నుంచి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, వైస్ చైర్మన్ భవాని, ఏఈఈ కే భార్గవ్‌రెడ్డి, మేనేజర్ పర్వతాలు, కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, శివకుమార్, మౌనిక, పద్మ, తేజస్విని, విలాస్, హేమలత, రవినాయక్, సుమన్, భావన, లావణ్య, రాజు, డాక్టర్ రాజు కుమార్, టీపీఓ వెంకటరఘునాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ మధుమోహన్

మద్యం దుకాణాలకు వేదామృతం పేరు వద్దు

ఇది వేదాలను కించపరడమే

- సంఘం సభ్యులు వక్కలంక శ్రీనివాస్
- బ్రాహ్మణ పరిషత్ చైర్మన్‌కు వినతి

హుడాకాంప్లెక్స్: మద్యం వ్యాపార సముదాయానికి వేదామృతం అనే పేరు పెట్టడం సరికాదని బ్రాహ్మణ సంఘం నాయకులు పేర్కొన్నారు. వేద+అమృతం అనే అర్థం వచ్చేలా ఉందని, ఇది వేదాలను కించపరిచే పేరని అన్నారు. ఈ పేరు పెట్టడం హైందవ జాతిని అవమానించడమే అవుతుందని పేర్కొన్నారు. ఈ పదం రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ కేవీ రమణాచార్యులకు బ్రాహ్మణ సంఘం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు వక్కలంక శ్రీనివాస్ మాట్లాడుతూ.. హైందవ ధర్మం, సనాతన ధర్మంపై ఈ మధ్య కాలంలో కొంత మంది కావాలనే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నీరా హట్ పేరుతో ప్రభుత్వ రంగ మద్యం కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారని, దానిపై మాకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ప్రభుత్వం అబ్కారీ శాఖకు ఆదేశాలు జారీ చేసి వేదామృతం అనే పదాన్ని ఎక్కడ వాడకుండా చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చింతపల్లి మంగపతిరావు, గడిచర్ల నాగేశ్వర సిద్ధాంతి, కళ్లెం గిరిప్రసాద్‌శర్మ, గోగుల పాటి కృష్ణమోహన్, రాఘవరావు, ప్రమోద్, జేవీఎల్ఎస్ రావు పాల్గొన్నారు.



బ్రాహ్మణ పరిషత్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

సర్పంచ్‌లకు ప్రత్యేక అధికారాలు ఉండాలి

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి డిమాండ్
- ధర్నాకు వెళుతున్న సర్పంచ్‌ల అరెస్ట్
- సొంత పూచీకత్తుపై విడిపించిన భాస్కర్‌రెడ్డి



పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం: గ్రామ సర్పంచులకు నిధులు విడుదల చేసే హక్కు ఉండాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని సర్పంచులు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద జరగనున్న మహా ధర్నాకు వెళుతుండగా పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న భాస్కర్‌రెడ్డి వారిని సొంత పూచీకత్తుపై విడిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని తెలిపారు. పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో సర్పంచ్‌లు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా సర్పంచులకు పూర్తి అధికారులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నందిగామ నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మస్న రవి, నాయకులు యాదయ్య, వెంకటేష్, కుమార్, తిరుపతయ్య, ఒగ్గు శ్రీకాంత్, దశరథ్, యూసుఫ్ ఖాద్రీ, చేపంగి ప్రవీణ్, లాజర్, నర్సింహ, భిక్షపతి, జంగారెడ్డి, యాదగిరి, చంద్రయ్య శివ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు భళా

- సందడిగా సంక్రాంతి ముగ్గుల పోటీలు
- నేత్రపర్వంగా ముగ్గులు వేసిన మహిళలకు బహుమతుల ప్రదానం

వనస్థలిపురం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని కళాభారతి సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వనస్థలిపురం శారదానగర్‌లో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ కొప్పోలు జగన్నాథరావు మాట్లాడుతూ.. గడచిన రెండు దశాబ్దాలుగా శారదానగర్‌లో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రసన్నాంజనేయులు, కె.ఎల్.నర్సింహారావు, ఇందిర, టి.యాదగిరిరావు, హరిప్రసాద్, రమాదేవి, అరుణ, జ్యోతిశ్రీ, లలిత, అంజనాదేవి, సువర్చల తదితరులు పాల్గొన్నారు.

సహారాస్టేట్స్ కాలనీలో...

మన్సూరాబాద్: సహారా స్టేట్స్‌కాలనీ మెయింటనెన్స్ కమిటీ ఆధ్వర్యంలో సామ రంగారెడ్డి ఫౌండేషన్ సహకారంతో సహారా స్టేట్స్ కాలనీలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో విజేతలకు బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సహారా స్టేట్స్ కాలనీ అధ్యక్షుడు కరణం శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రాఘవేందర్, కోశాధికారి జగత్‌రెడ్డి కాలనీ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాపోలు విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి గంగదాసు కృష్ణారెడ్డి బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్,, మహిళా మోర్చా రంగారెడ్డి అర్బన్ అధ్యక్షురాలు కృష్ణవేణి, చిల్కూరు మాధవి, కవితారెడ్డి, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ పేరుతో రైతులను మోసం



ఈటల సమక్షంలో బీజేపీలో చేరుతున్న యువకులు

- ఎమ్మెల్యే ఈటల రాజేందర్
- బీజేపీలో పలువురి చేరిక

కందుకూరు: ఫార్మాసిటీ పేరుతో సీఎం కేసీఆర్, మంత్రి సబితారెడ్డి రైతులను మోసం చేస్తున్నారని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. సోమవారం కందుకూరు మండలం ముచ్చర్ల, ఊట్లపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. పార్టీ జిల్లా కార్యదర్శి తేరటి లక్ష్మణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో యువకులు హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ నివాసంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన కృష్ణ, యాదగిరి, శివ, కుమార్, వెంకటేష్, సతీష్, శ్రీనివాస్, రామదాసు, కృష్ణ, ఆంజనేయులు తదితరులకు ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ కోసం యువత బీజేపీలో చేరడం చాలా సంతోషమన్నారు. ఫార్మాసిటీలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేసే దిశగా ఉద్యమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ఎంపీటీసీ బక్క మల్లేష్, ఎంపీపీ మంద జ్యోతిపాండు, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మంద పాండు, నాయకులు తేరటి రవి ముదిరాజ్, సిద్ధాల శ్రీను, ఊటు మహేందర్, తేరటి హరికృష్ణ, నిమ్మ అంజిరెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

మహేశ్వరం: మండలంలోని ఘట్టుపల్లి మైదానంలో సోమవారం మహేశ్వరం కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆడారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ పోటీలను నిర్వహించామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం బార్ అసోసియేషన్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ ఎండీ నసీర్ పాషా, ట్రెజరర్ మురళీగౌడ్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎర్రవాపు ఇజ్రాయెల్, ఎస్ శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు పీ శ్రీపాల్‌రెడ్డి, ఎల్ శ్రీనివాస్, ఏ వీనేందర్, ఏ రాజేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న హరికిషన్ గౌడ్

చేనేతలు రాజకీయంగా ఎదగాలి

హుడాకాంప్లెక్స్: చేనేత కార్మికులందరూ రాజకీయంగా ఎదగాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయబండి రంగాచారి పిలుపునిచ్చారు. సోమవారం సరూర్‌నగర్ డివిజన్ ఏఎస్‌ఆర్ గార్డెన్స్‌లో భక్త మార్కండేయ పద్మశాలి సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు కుంట్ల ఆంజనేయులు నేత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆర్పీ రంగాచారి హాజరై ప్రసంగించారు. దేశంలో బడుగు బలహీన వర్గాలంతా సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో చేనేతలకు బడ్జెట్‌లో నిధులు అరకొరగా కేటాయించి అవి కూడా ఖర్చు పెట్టలేని పరిస్థితి ఉందన్నారు. చేనేతలకు అధిక నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేనేతల వస్త్రాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందినా, ప్రభుత్వ గుర్తింపునకు నోచుకోక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, నాయకులు బొమ్మ రఘురాం, రావిరాల సంధ్యారాణి, చక్రవర్తి, గోషిక నరసింహ, మిర్యాల సుదర్శన్, నామా లక్ష్మణ్ నేత, ఎల్లయ్య, జక్క నాగయ్య పాల్గొన్నారు.



జ్ఞాపికలు అందజేస్తున్న సంఘం నేతలు